ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు చేపట్టాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ ఫ్లెక్సీ దగ్గర చేపట్టే నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఆమానుషమైన పద్ధతిలో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను రాజ్యాంగ నిబంధనలను కాలరాస్తున్నదని తెలిపారు. గిరిజనులపై హత్యాకాండను అమలు పరుస్తోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు విలువైన అటవీ సంపద, ఖనిజ వనరులను ధారాదత్తం చేయడం కోసం దేశ పౌరులను, ఆదివాసీలను హత్య చేస్తోందని మండిపడ్డారు. ఆపరేషన్ సింధూర్‌ను అమెరికా జోక్యంతో నిలిపివేసి పాకిస్తాన్‌తో చర్చలు చేపట్టారని తెలిపారు. సొంత దేశంలో మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు చేపట్టకుండా మోడీ షాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ విధానాలతో ఆదివాసీలను తమ జీవనోపాధుల నుంచి పరాయికరణ చేస్తోందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం జరిగే నిరసన కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాస్వామికవాదులు, అభ్యుదయ వాదులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్య కళాశాలలకు తొలగని గ్రహణం



- ప్రారంభానికి నోచని పులివెందుల, మదనపల్లి కళాశాలలు
- ప్రశ్నార్థకంగా రాజంపేట, ప్రొద్దుటూరు కళాశాలల ఏర్పాటు
- తొమ్మిది రకాల స్కూళ్లతో గందరగోళం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా విద్యా రంగంలో గందరగోళ వాతావరణం నెలకొంది. ప్రాథమిక పాఠశాలల సంస్కరణల దగ్గర నుంచి ఉన్నత విద్యలో భాగమైన పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలు ప్రారంభానికి నోచకపోవడం, ఫీజురీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడం వరకు తల్లికివందనం పథకం అమలు మినహా ఏడాది పాలన అసంతృప్తిని కలిగించింది. రెండేళ్లుగా మదనపల్లి మెడికల్ కళాశాలలో 150 సీట్లు, పులివెందుల మెడికల్ కళాశాలలో 100 సీట్లు వెరసి 500 మెడికల్ సీట్లు గల్లంతు కావడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల ముంగిట అప్పటి సర్కారు పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలల ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లు చేసింది. అనంతరం రాష్ట్రంలో అధికారంలోకి కూటమి ప్రభుత్వం పెండింగ్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయకుండా, నేషనల్ మెడికల్ కౌన్సిల్‌తో అకడమిక్ ఇయర్ ప్రారంభించడంపై సంప్రదింపులు చేసి మెడికల్ కళాశాలలను ప్రారంభించడంలో ఘోర వైఫల్యం చెందడంపై విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది.

ప్రయివేటు మోజుతోనేనా!

కడప, అన్నమయ్య జిల్లాల్లోని పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు ఏర్పాట్లు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి.ఆయా వైద్య కళాశాలలకు చెందిన పలువురు వైద్య నిపుణులు, అకడమిక్ సిబ్బంది, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బందిని కడప, తిరుపతి, నంద్యాల, రాజమండ్రి తదితర ప్రాంతాలకు బదిలీ చేయడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఒక వైపు ఏటా 250 చొప్పున రెండేళ్లుగా మెడికల్ సీట్లను కోల్పోవడం, మరోవైపు ప్రభుత్వ వైద్యా సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతో వ్యవహరించడంపై సర్వాత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రయివేటు సంస్థలకు అప్పగించాలనే ఉద్దేశంతోనే మెడికల్ సీట్లను కోల్పోయేలా చేశారనే వాదనకు బలం చేకూరడం గమనార్హం.

వైద్య కళాశాలల ఏర్పాటు హామీ అమలేదీ

ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజంపేట, ప్రొద్దుటూరు పట్టణాల్లో మెడికల్ కళాశాలలను, రాయచోటి పట్టణంలో సైతం ప్రసూతి ఆస్పత్రిని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చి పాలన ఏడాది గడిచినప్పటికీ హామీల అమలు ప్రస్తావన చేయక పోవడం గమనార్హం. జిల్లాకు చెందిన ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు సైతం పదవులపై ఆశలతో హామీల అమలుపై ప్రశ్నించిన పాపానపోని పరిస్థితి ఏర్పడింది.

తల్లికి వందనంతో ఉపశమనం

తల్లికి వందనం పథకం అమలుతో కాస్త ఉపశమనం కలిగింది. జిల్లాలోని 2,41,119 మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో నగదు జమచేస్తోంది. ఎన్నికల ముంగిట ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయడంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి నిలిపేసి, అధికారంలోకి వచ్చినప్పటికీ పాత బకాయిల చెల్లింపులను విస్మరించడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన వేలాది మంది బిటెక్, తదితర ఉన్నత విద్య అభ్యసించిన విద్యార్థుల సర్టిఫికెట్ల పంపిణీ నిలిచిపోవడంతో వ్యతిరేకత నివురుగప్పిననిప్పులా ఉంది. పాఠశాల విద్యలో సంస్కరణలతో గందరగోళం నెలకొంది. వైసిపి సర్కారు హయాంలో ఆరు పాఠశాలల వ్యవస్థ, ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది పాఠశాలల వ్యవస్థతో అయోమయం నెలకొంది. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ ఉపాధ్యాయుల బదిలీలు కొనసాగుతూనే ఉన్న నేపథ్య ంలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులు, ఉర్దూ, తెలుగు పండిట్ ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెలకొంది.

సత్వరమే మెడికల్ కళాశాలను ప్రారంభించాలి

మదనపల్లి మెడికల్ కళాశాలను ప్రారంభించాలి. రెండేళ్లుగా వందలాది మెడికల్ సీట్లు కోల్పోయేలా చేయడం దారుణం. మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించకపోవడం దారుణం. ఎన్డీయే సర్కారు నిర్లక్ష్యం కార ణంగానే విద్యారంగానికి తీరని నష్టం వాటిల్లుతోంది.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, అన్నమయ్య.

ప్రయివేటుకు అప్పగించడం తగదు

మెడికల్ కళాశాలలను ప్రయివేటు సంస్థలకు దారాదత్తం చేయడం తగదు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉంటే పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు, పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. 50 శాతానికిపైగా పూర్తి చేసిన భవన నిర్మాణాలకు నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- శివప్రసాద్, బాస్ రాష్ట్ర అధ్యక్షులు, అన్నమయ్య.

వైద్య కళాశాలలకు నిధులు కేటాయించాలి

పులివెందుల మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులకు నిధులు కేటాయించాలి. రాష్ట్రంలోని ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లుగా అడ్మిషన్లు కోల్పోయిన దుస్థితి దాపురించింది. ఇప్పటికైనా మేల్కొని సెప్టెంబర్ నుంచైనా అకడమిక్ ఇయర్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రాహుల్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, కడప.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మికుల నడ్డి విరిచేందుకు తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు అయ్యేంత వరకూ ఐక్యంగా పోరాటానికి వేదికగా జరిగే జులై 9వ తేదీన నిర్వహించే సమ్మె జయప్రదానికి వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున కృషి చేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు ఏళ్ల తరబడి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలు హక్కులును కార్పొరేట్ల ప్రయోజనాల కోసం వారిచ్చే కమీషన్‌ల కొరకు కార్మిక చట్టాలు హక్కులు రద్దు చేసి వారిని కట్టు బానిసలుగా మార్చడం కోసం నాలుగు లేబర్ కోడ్స్ తేవడాన్ని తీవ్రంగా ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఒక వైపు కార్పొరేట్లకు రుణాలు మాఫీ చేస్తూ, కొత్తరుణాలు ఇస్తున్నారని పేద ప్రజలపై చిన్న మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలపై విద్యుత్ యూజర్ చార్జెస్, జిఎస్‌టి, పన్నులు వేయడంతో వేల సంఖ్యలోపరిశ్రమలు మూత పడ్డాయని పలితంగా కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమను నష్టాల పేరుతో ప్రయివేట్‌పరం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. రైతుల పంటలకు గిట్టు బాటు ధర ఇవ్వకుండా, కార్పొరేట్ వ్యవసాయం పేరుతో నల్ల చట్టాలు తెచ్చి భూమి లాక్కునే పరిస్థితి వస్తే కూరగాయల ధరలు అడ్డు అదుపు లేని పరిస్థితి దాపురిస్తుందని రైతుల ఆత్మహత్యలు నివరించాలని మాట్లాడారు. కనీసవేతనం రూ.26 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమానవేతనం చెల్లించాలని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభ్యుల వేతనాలు మాత్రమే పెంచుకున్నారన్నారు. కార్మికుల జీతం పెంచకుండా పనిగంటలు పెంచి ఉద్యమాల వైపు రానీయకుండా, సంఘం పెట్టుకునే హక్కు లేకుండా ప్రశ్నించకుండా చనిపోయిన తర్వాత పెన్షన్ హక్కులు వరకు ఉన్న చట్టాలు ప్రాణ త్యాగాలతో కూడుకున్నవని ఎటువంటి పరిస్థితిల్లోనైనా వాటిని రద్దు కానివ్వమని పేర్కొన్నారు. జులై 9న సమ్మె పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.ఓబుళమ్మ, ఎ.వి.రమణ, డి.వెంకట్రామయ్య, ఎస్.మెహరున్నిసా పాల్గొన్నారు.

తల్లికి వందనంలో నిబంధనలను సడలించాలి

- అర్హులందరికీ పూర్తిస్థాయిలో అందించాలి
- నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి నరసింహ

నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనంలో షరతులు సడలించి అర్హులందరికీ పూర్తిస్థాయిలో అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం అంబేద్కర్ సర్కిల్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎటువంటి ఆంక్షలు లేకుండా తల్లికి వందనం అమలు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అండగా నిలబడతామని, ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మంది విద్యార్థులకు రూ.15 వేలు చొప్పున తల్లి ఖాతాల్లో జమ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందిని ప్రశ్నించారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఇవ్వాల్సిన విద్యా కానుక ఇవ్వలేదని, ఈ ఏడాది కూడా విద్యా సంవత్సరం ప్రారంభం రోజున విడుదల చేస్తామని చెప్పి ఇవ్వకుండా తల్లులను వంచించే మోసం చేశారని విమర్శించారు. కూటమి నాయకులు ఏడాది పాలనలో హామీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలుకుతూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం తప్ప మరొకటి కాదన్నారు. ప్రభుత్వం హామీలను గాలికి వదిలేసారన్నారు. తల్లికి వందనం పథకంలో విద్యార్థికి రూ.13 వేలు మాత్రమే జమ చేస్తున్నారని, రూ.2 వేలు స్కూళ్ళ, కాలేజీల అభివృద్ధి పనుల కోసం మినహాయింపు ఇస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ బడులలో చదువుతున్న విద్యార్థుల వద్ద వసూలు చేసే డబ్బును అ విద్యా సంస్థల అభివృద్ధికి ఉపయోగిస్తుందా? అంటే ప్రయివేటు, కార్పొరేట్ బడులను అబివృద్ధి చేసే భాద్యత ప్రభుత్వానిదా అని ప్రశ్నించారు. అనేక అసంబద్ధ నిబంధనల పేరుతో విద్యార్థుల సంఖ్యను కుదింపు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కరెంట్ 300 యూనిట్లు వినియోగించినా, కారు ఉన్నా అర్హులు కారన్న నిబంధనను గతంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు వ్యతిరేకించి, ఇప్పుడు అతనే మరల అదే నిభందనలను కొనసాగించడం నయవంచన కాదా అని ప్రశ్నించారు. షరతులను తొలగించి చదువుకొనే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 54,94,703 మంది మాత్రమే ప్రస్తుతం అర్హులని ప్రభుత్వం తెలియజేస్తున్నప్పటీ ఇంకా 12,32,461 మంది నూతనంగా చేరేందుకు అవకాశం ఉందని, వారిని కూడా అర్హులుగా చేర్చాలని కోరారు. ఒక కుటుంబంలో పాఠశాల, డిగ్రీ చదివే విద్యార్థులు ఉంటే, ఒక్కరికి మాత్రమే ఏదైనా పథకం వర్తిస్తుందని నిభందనలు తేటతెల్లం చేస్తున్నాయన్నారు. ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు ఫీజురీయింబర్స్‌మెంట్‌కు లింక్ పెట్టడం సరికాదని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా తల్లికి వందనం అందరికి రూ.15 వేలు చొప్పున ఇవ్వాలని లేని పక్షంలో తల్లిదండ్రులు, విద్యార్థుల వ్యతిరేకతను చవిచూస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, సుల్తాన్, బన్నీ, శివాజీ పాల్గొన్నారు.

డిజిపి హరీష్‌కుమార్ గుప్తాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

డిజిపిని కలిసిన ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్: రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు డిజిపి ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డిజిపి జిల్లాలో శాంతిభద్రతలు, కేసులు, ఇతర సమస్యలపై అడిగి తెలుసుకున్నారని ఎస్‌పి పేర్కొన్నారు.

ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రాయచోటి: వివిధ కారణాలవల్ల చదువు మానేసిన వారు పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఎపి ఓపెన్ స్కూల్ ద్వారా ప్రభుత్వం సువర్ణ అవకాశం కల్పిం చిందని డిఇఒ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక డిఇఒ కార్యాలయంలో మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ పరీక్షలు ద్వారా విద్యార్థులు పొందే ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెగ్యులర్ విద్యార్థులతో సమా నమైన గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ అర్హత పొందిన వారు ఎలాంటి ఉద్యోగా నికైనా అర్హులేనని, చదువుపై ఆసక్తి ఉండి ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్, మెడిసిన్ కోర్సులు చేయడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా స్థిరపడి ఉన్నారన్నారు.ఓపెన్ స్కూల్ ద్వారా పదవ తరగతిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31 వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయసు నిండి ఉండాలని, చదవడం, రాయడం తెలిసి ఉండాలని, ఏదో ఒక తరగతి టిసి, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డును కలిగి ఉండాలన్నారు. ఇంటర్ ప్రవేశానికి 10వ తరగతి మార్కుల జాబితా 10వ తరగతి టిసిని దరఖాస్తుతో పాటు అందజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు వికలత్వం అర్హత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలని సూచించారు. దరఖాస్తులకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా జూలై 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, రూ.200 అపరాధ రుసుంతో ఆగస్టు 1వ తేదీ నుండి ఆగస్టు 15 వరకు అవకాశం ఉందన్నారు. ఇతర వివరాలకు పని వేళల్లో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించవ చ్చునన్నారు.ఆసక్తి కలవారు మీసేవ, ఎపి ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన మండలాల్లో ఎఐ సెంటర్లు ఉన్నాయని, ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు తెలియజేశారు.

అంగన్వాడీల్లో పిల్లల నమోదు శాతం పెంచాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల నమోదు శాతం పెంచాలని సిడిపిఒ వై.నాగవేణి తెలిపారు. శుక్రవారం మదనపల్లె అర్బన్, రూరల్ అంగన్వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ పిలుస్తుందనే కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లల నమోదు పెంచడం, నాణ్యతతో కూడిన ప్రీస్కూల్ విద్యను అందించడం, స్కూల్ రెడీనెస్ కార్యక్రమాలు, ఐదేళ్లలోపు పిల్లల పోషణను గుర్తించడం, వారి పోషణ స్థితిని మెరుగు పరచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

అక్రమ కేసు పెట్టారంటూ

పోలీసుస్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వ్యక్తిని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

బాలిక ఆత్మహత్య ఘటన కేసులో తన కుమారుడు తారకరత్నను పోలీసులు అన్యాయంగా ఇరికించి జైలుకు పంపారంటూ రాయచోటి పోలీసుస్టేషన్ ఎదుట తారకరత్న తండ్రి వెంకటరమణ మనస్థాపానికి గురై శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంకటరమణను పోలీసులు పోలీసుస్టేషన్ నుండి హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంకటరమణ కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం రాయచోటిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 11వ తేదీన పట్టణంలోని మిట్టవాండ్లపల్లిలో బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఆమె తండ్రి చంద్రగిరి ఉత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తారకరత్న అనే యువకుడుని పోలీసులు అరెస్టు చేశారు. తమ కుమారుడు తారకరత్న ఏ తప్పు చేయలేదని, చనిపోయిన బాలికకు తన కుమారునికి ఎలాంటి సంబంధం లేదని తమ కుమారుడ్ని వదిలేయాలంటూ పోలీసుస్టేషన్‌కు వెళ్తే తమపై ఎస్ఐ బాలకృష్ణ దురుసుగా ప్రవర్తించి బయటకు గెంటి వేశారంటూ తారకరత్న తల్లి స్వర్ణ ఆరోపించారు. తమకు జరిగిన అవమానాన్ని భరించలేక మనస్థాపానికి గురైన తన భర్త వెంకటరమణ పురుగులు మందు తెచ్చుకుని పోలీసుస్టేషన్ ఎదుట తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని, తన భర్తను పోలీసులే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ వదిలి వెళ్ళి పోయారంటూ ఆమె ఆరోపించారు. బాలిక మృతి వెనుక తన కుమారుని పాత్ర ఏమీ లేదని, ఆ బాలిక ఆత్మహత్య చేసుకున్న గ్రామంలోనే లేడున్నారు. ఈ కేసులు తన కుమారునికి ఎలాంటి సంబంధం లేదంటూ ఇంటికి పంపిస్తామని మొదట చెప్పిన పోలీసులు వైసిపి నాయకులు దశరథరామిరెడ్డి రాజకీయ ఒత్తిడితో తమ కుమారుడిపై అక్రమంగా కేసు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. ప్రభుత్వం విచారించి తమ కుమారునికి న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

చిత్తూరు, కడప జట్ల ఘన విజయం

తలపడుతున్న అనంతపురం, చిత్తూరు జట్లు

లోహిత్ (125 నాటౌట్)

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో శుక్రవారం జరిగిన మ్యాచుల్లో చిత్తూరు, కడప జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టుపై 7 వికెట్ల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 55.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఆ జట్టులోని భువనేశ్వర్ 65, జయంత్‌కృష్ణ 41 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని చరణ్ 3, ప్రకాష్ రాజ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 230 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 33.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 231 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మి నారాయణ అద్భు తంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 14 బంతులను ఎదుర్కొని 17 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 125 పరుగులు చేసి ఆజేయంగా నిలిచాడు. వేదాంత్ 32 పరుగులు చేశాడు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 36 పరుగుల తేడాతో కడప జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 48.4 ఓవర్లలో 243 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రణధీర్‌రెడ్డి 65, ఆర్దిత్‌రెడ్డి 61(నాటౌట్) పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ 3, తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 244 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 37.5 ఓవర్లలో 207 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చవిచూసింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 77, మన్విత్ 38 పరుగులు చేశారు. కడప జట్టులోని ఆర్దిత్‌రెడ్డి 2, ధీరజ్ కుమార్‌రెడ్డి 2, హృతిక్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్ల్ లాండ్ స్టీనర్ జ్ఞాపకార్థం శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని హెల్పింగ్ మైండ్స్ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడం హర్షనీయమని సిద్దిక్ పేర్కొన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వరుస రక్తదాన శిబిరాల్లో మదనపల్లె బెంగళూరు బస్టాండ్‌లో రక్తదాన శిబిరం, ఉచిత రక్త వర్గీకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్ల్ లాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ కార్ల్ లాండ్ స్టీనర్ జయంతిని ప్రపంచ రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటారని, ప్రతి ఒక్కరూ బ్లడ్ గ్రూప్స్ తెలుసుకోవాలని, రక్తదానానికి ముందుకు రావాలన్నారు. 12 ఏళ్ల కాలంలో వేలాది మందిని రక్తదాతలుగా తయారు చేసి తమ సంస్థ రక్తదానంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని, ఇకపై కూడా మరిన్ని రక్తదాన శిబిరాలు, రక్తదాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో స్ఫూర్తి నింపేలా సేవలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.ఆర్.మొబైల్స్ అధినేత, మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్ అజాం, మదనపల్లె వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆఫీసర్ బాలచంద్ర నాయుడు, సిబ్బంది కృష్ణ, హెల్పింగ్ మైండ్స్ సభ్యులు బాచి, కమ్మల ఆనంద్, కిరణ్, గణేష్, అశ్విని, సాంబ పాల్గొన్నారు.

పీలేరు ఎంఎంసి కార్యదర్శిగా హరినాథ్



బాధ్యతలు స్వీకరిస్తున్న హరినాథ్

ప్రజాశక్తి-పీలేరు: వ్యవసాయం మార్కెట్ కమిటీ కార్యదర్శిగా ఎం.హరినాథ్ శుక్రవారం విధుల్లో చేరారు. చిత్తూరు జిల్లా కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఈయన పీలేరు ఎఎంసికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించనున్నారు. వాల్మీకిపురం ఎఎంసి కార్యదర్శి కుమార్ పీలేరు ఇన్‌ఛార్జి ఎఎంసి కార్యదర్శిగా పనిచేస్తూ తిరిగి ఆయన వాల్మీకిపురం పూర్తిస్థాయి కార్యదర్శి బాధ్యతల్లో చేరారు. ఈ సందర్భంగా కొత్తగా ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్న హరినాథ్ మాట్లాడుతూ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాలు, ఎఎంసి చైర్మన్ పురం రామమూర్తుల సలహా, సూచనల మేరకు రైతులు, వ్యాపారులు, కార్యాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ వ్యవసాయ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రైతులకు, వ్యాపారులకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని చెప్పారు.

నిమ్మనపల్లి : తహశీల్దార్ జి.తపస్వినికి స్వాగతం పలుకుతున్న రెవెన్యూ సిబ్బంది

తహశీల్దార్లు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నిమ్మనపల్లి నూతన తహశీల్దార్‌గా జి.తపస్విని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిమ్మనపల్లిలో పనిచేస్తున్న తహశీల్దార్ కె.అమర్నాథ్ రైల్వేకోడూరుకు బదిలీ కాగా, కూరబలకోటలో పనిచేస్తున్న జి.తపస్విని నిమ్మనపల్లె తహశీల్దార్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సిరాజుద్దీన్, ఆర్.ఐ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, మండల సర్వేయర్ గోపీనాథ్, ఎఎస్ఒ, విఆర్ఒలు, సర్వేయర్లు, టిడిపి నాయకులు ఆర్.జె వెంకటేష్, డీలర్ల సంఘం అధ్యక్షులు గంగాధర, ఉపాధ్యక్షులు మల్లేశ్వర రావు, చౌకదుకాణం డీలర్లు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. పలువురు నాయకులు, ప్రజా సంఘాల నేతలు తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని భూ సమస్యలను పరిష్క రించడానికి, రెవెన్యూ రికార్డులను పకడ్బందీగా నిర్వహించడానికి చర్యలు చేపడ తామన్నారు. రెవిన్యూ సిబ్బంది చట్ట ప్రకారం తమ విధులను నిర్వహి ంచాలని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

రామాపురం: రామపురం తహశీల్దార్‌గా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రామాంజనేయులు కలెక్టరేట్ సూపరిం టెండెంట్‌గా బదిలీపై వెళ్లారు.ఆయన స్థానంలో వీరబల్లి తహశీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

తహశీల్దార్‌ను కలిసిన టిడిపి నాయకులు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ వెంకటేశ్వర్లు ను గాలివీటి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు .సందర్భంగా మండల ప్రజలకు రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కరించి ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే మంత్రి రాంప్రసాద్ రెడ్డికి మంచి పేరు తీసుకు రావాలని తహశీ ల్దార్‌ను కార్యక్రమంలో టిడిపి మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట రమణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామకృష్ణ గౌడ్ దేవదర్శన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సహదేవరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండల తహశీల్దార్‌గా ఎన్ క్రాంతికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ లో డిప్యూటేషన్‌పై ఎల్ఎ.సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ బదిలీపై లక్కిరెడ్డిపల్లికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాసులు రాజంపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కు పుష్పగుచ్చాన్ని అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రెడ్డన్న, హరి ప్రసాద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేష్, విఆర్ఒలు కృష్ణ, పుష్ప రాజ్, వెంకోజీ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రాజంపేట

స్థానిక పట్టణంలోని సరస్వతిపురం, తాళ్లపాక, బ్రాహ్మణపల్లి, తాళ్లపాక, ఆకేపాడు, నందలూరు సబ్ స్టేషన్లలో 11 కెవి ఫీడర్‌కు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగింపు, మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిఇ సురేంద్రనాథ్ తెలిపారు. రాజంపేట, నందలూరు టౌన్, తాళ్లపాక, బ్రాహ్మణపల్లి, ఆకెపాడు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు పరిసర గ్రామీన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిలిపి వేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సంస్థకు సహకరించాలని ఆయన కోరారు. **నిమ్మనపల్లె :** శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎఇ నాగరాజా తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ..రెండవ శనివారం సందర్భంగా మండలంలోని విద్యుత్ కేంద్రాలలో, విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో, విద్యుత్ లైన్‌లలో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు, రైతులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి అందుకు అనుగుణంగా ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు.

రామసముద్రం ఎస్ఐగా రమేష్‌బాబు

ప్రజాశక్తి-రామసముద్రం

రామసముద్రం నూతన ఎస్ఐగా రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో రాయచోటి స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రవికుమార్ రాయచోటి విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పర్యవేక్షణ ఎల్లప్పుడూ నిర్వహిస్తానని, తమ దృష్టికి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిశీలించి న్యాయం చేస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపి ప్రజలకు రక్షణగా ఉంటామని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

రేపు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-ములకలచెరువు

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని హెల్పింగ్ మైండ్స్ టీమ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక వైపు ఉన్న ఎంపిపి పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉచిత రక్త వర్గీకరణ, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పఠాన్ ముస్తఫా తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 3గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రక్త వర్గీకరణ, రక్తదాన శిబిరంలో స్థానిక యువకులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూపును ఉచితంగా తెలుసుకో వచ్చునని, రక్తదానం కార్యక్రమంలో పాల్గొన వచ్చునని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చతికిల పడ్డ డబుల్ ఇంజిన్ సర్కార్

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ కూటమి ప్రభుత్వం అప్పుల్లో దూసుకు పోతూ అభివృద్ధిలో చతికిల పడిందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ దూసుకు పోతున్నదని టిడిపి నాయకులు చెప్పడం హాస్యాస్పదమని చెప్పారు. 2023- 24 లో కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చిన గ్రాంట్ రూ 34,698 కోట్లు కాగా 2024-25 లో రూ 20,135 కోట్లు మాత్రమే వచ్చిందని చెప్పారు. దీని ప్రకారం చూస్తే రూ 14,563 కోట్లు తగ్గిందని తెలిపారు. సంజీవినీ లాంటి ప్రత్యేక హోదా రాలేదని చెప్పారు. సీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ రాలేదని తెలిపారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు కర్మాగారం నిర్మాణం కాలేదని అన్నారు. దుగ్గరాజపట్నం ఓడ రేవు నిర్మాణం కూడ చేపట్ట లేదని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం గ్రాంట్ ఇవ్వలేదని అప్పు తెచ్చుకోమని చెపుతున్నట్లు ఆయన తెలిపారు. 2023-24 కంటే 2024-25 మూల ధన వ్యయం రూ 4,413 కోట్లు తగ్గిందని చెప్పారు.

కలిసికట్టుగా టిబిని అంతం చేద్దాం

-డాక్టర్ చిన్న రెడ్డెప్ప

ప్రజాశక్తి - కలికిరి

కలిసికట్టుగా టిబిని అంతం చేద్దామని మేడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ చిన్నరెడ్డెప్ప అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహమ్మద్‌రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి మునెల్లపల్లి పంచాయతీ సర్పంచ్ శ్రీమతి జాహీదా, మండల ప్రాదేశిక సభ్యులు షహీనా అధ్యక్షతన దూదేకులపల్లిలో ప్రజలకు టిబి ముక్త్ భారత్ కార్యక్రమాన్నినిర్వహించారు. టిబి వ్యాధి గ్రస్తులు ప్రపంచంలో ఉన్న దేశాలాన్నిటిలో కన్నా భారతదేశం లోనే ఎక్కువ మంది ఉన్నారని అన్నారు. ఈ వ్యాధి ఒకరి నుంచి ఇంకొకరికి గాలి ద్వారా, తుంపరల ద్వారా వ్యాప్తి చెందుతుందని అన్నారు. ఒక సూక్ష్మ క్రిమి ద్వారా జ్వరం వస్తుందని, రెండు వారాలకు పై బడి దగ్గు ఉండుట, ఛాతిలో నొప్పి, గస, ఆయాసం, గళ్ళ పడుట, రక్తం గళ్ళ లో పడుటుందన్నారు. రాత్రి పూట జ్వరం వంటి లక్షణాలు ఉంటే టిబి వ్యాధి అని అనుమాన పడి ప్రభుత్వ ఆస్పత్రి లో గళ్ళ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వ్యాధి నిర్ధారణ ఐతే ఆరు నెలలు మాత్రలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి పోషన్ యోజన పథకం కింద మంచి పౌష్టికహారం తినడానికి నెలకు వెయ్యి రూపాయలు వారి ఖాతా లో జమ చేస్తారని తెలిపారు. సైటిబి పరీక్షలు క్షయ రోగి బంధువులు ఎఎన్ఎం దగ్గర చేయించుకుని ఒకవేళ పాజిటివ్ వస్తే టబి రాకుండా భవిష్యత్‌లో మూడు నెలలు మాత్రలు తినాలని అన్నారు. టిబి రోగులకు పౌష్టి కాహారం ఇవ్వడానికి దాతలు ముందుకు రావాలని కో రారు. అనంతరం ప్లకార్డులు ప్రదర్శించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, ఎస్‌టి ఎస్.నాగిరెడ్డి, సిహెచ్ఒ జ్యోతి, సెక్రటరీ రేఖ, ఎఎన్ఎం జయంతి,ఆశాకార్యకర్త అనీఫా, ప్రజలు పాల్గొన్నారు.

టిబిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఏకలవ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలి



డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌వర్మ

ప్రజాశక్తి-కలికిరి

ఆంధ్రప్రదేశ్ ఆదివాసి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర కమిటీ, అన్నమయ్య జిల్లా కమిటీ తరపున ఏకలవ్య మహారాజు జయంతిని ప్రభుత్వం అధికార ఖర్చులతో, అధికారిక స్థాయిలో ప్రకటించాలని కోరుతూ శుక్రవారం సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్ఒ మధుసూదనరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ మహాభారతం ఇతిహాసంలో విశిష్ట స్థానాన్ని సంపాది ంచిన ధీరనాయకుడు, సామాన్యునికి ఆదర్శంగా నిలిచిన మహా యోధుడు ఏకలవ్య మహారాజు అని క్షత్రియ ధర్మానికి, గురుభక్తికి, సమానత్వానికి ప్రతీకగా నిలిచారని అన్నారు.ఆ మహాపురుషుడి జయంతిని ప్రతి సంవ త్సరం ఏకాదశి పర్వదినాన, ప్రభుత్వ అధికార లాంఛనాలతో, ప్రభుత్వ ఖర్చు లతో ఘనంగా నిర్వహించాలని కోరారు.లంబాడీల (సుగాలీల) దైవమైన సేవాలాల్ నాయక్ జయంతి, బోయి వాల్మీకుల పూజ్యుడు వాల్మీకి మహర్షి జయంతి, ఇత్యాది గిరిజన గొప్పవారి జయంతులు అధికారికంగా జరుపుతూ గిరిజన సమాజానికి గౌరవం కలిగిస్తోందన్నారు. ఇదే తరహాలో దాదాపు అన్ని గిరిజన వర్గాలకు సాంస్కృతికంగా, చారిత్రకంగా ఆదర్శంగా నిలిచిన ఏకలవ్య మహారాజు జయంతిని కూడా ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, ప్రతి జిల్లాలో గిరిజన శాఖల ఆధ్వర్యంలో జరపాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి ఎరుకల సేవా సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, సంఘ సభ్యులు రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

తాగునీటి సమస్య పరిష్కారమే తమ ధ్యేయమని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ నాయినివారిపల్లిలో తాగునీటి బోరును ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా నీటి ఎద్దడి ఉండడంతో గ్రామస్తులు చమర్తి దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంజూరు చేయిస్తానని హామీనిచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కూటమి ప్రభు త్వంలో తాగునీరు, సిమెంట్‌రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

సౌర విద్యుత్‌ను వాడుదాం..ప్రకృతిని కాపాడుకుందాం

మాట్లాడుతున్న ఇఇ రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రజలు సౌర విద్యుత్‌ను వాడి ప్రకృతిని కాపాడుకుందామని ఇఇ ఇఇ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పుల్లంపేటలోని ఎస్‌వి కల్యాణ మండపంలో పిఎం సూర్యఘర్ యోజనపై ఎఇ కుమార్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఇ మాట్లాడుతూ సౌర విద్యుత్ వల్ల ప్రకృతికి తద్వారా మనం దరికీ మేలు జరుగుతుందని అన్నారు. విద్యుత్ బిల్లులు కూడా గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. ప్రతి ఇంటి రూఫ్ టాప్ మీద కిలో వాట్‌కు రూ.30 వేలు, 2 కిలో వాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేల చొప్పున ప్రభుత్వం రాయితీ లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకొని గృహాలకు వినియోగిం చుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని అన్నారు. వినియో గదారులు అదనపు లోడును క్రమ బద్ధీకరించుకోవాలని ఈ నెల ఆఖరిలోగా క్రమబద్ధీకరించుకుంటే 50 శాతం రాయితీ వస్తుందని పేర్కొన్నారు. సౌర విద్యుత్‌కు ఐదేళ్ల వరకు ఉచి తంగా సర్వీసింగ్ చేస్తారని 30 సంవ త్సరాలు వారంటీ ఉంటుందని తెలి పారు. బ్యాంకులో కూడా తక్షణమే ఒక్కరోజులోనే రుణం మంజూరు చేస్తారని, సౌర విద్యుత్తు ప్లాంట్‌ను మనం నిర్మించుకోవడం ద్వారా అదనం గా ఆదాయం పొందవచ్చని అన్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రజ లకు ఎటువంటి సందేహాలు ఉన్నా ఎటువంటి, సహాయం కావాలన్నా ఎఇకి సమాచారం ఇస్తే వారికి కావలసినటువంటి సహాయ సహకారాలు అందజే స్తారని అన్నారు. కార్యక్రమంలో ఎడి మురళీ ధర్‌రెడ్డి, ఇన్ సోల్ సోలార్ ఇంజినీర్స్ ఫండర్ శివప్రకాష్‌రెడ్డి, విద్యుత్ వినియోగదారులు ప్రజలు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి-పీలేరు

మలేరియ నియంత్రణ, నివారణకు ప్రజల్లో అవగాహన కల్పిద్దామని తలుపుల ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. మలేరియా మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని బండ్లవంకలో వైద్యాధికారి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని తమ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్లాస్మోడియం పరాన్న జీవి సంక్రమణ కలిగిన ఆడ అనాఫిలాస్ దోమ వల్ల మలేరియా వ్యాపిస్తుందని, చలి జ్వరం, తలనొప్పి, వాంతులు ఈ వ్యాధి ప్రధాన లక్షణాలని అన్నారు. వ్యాధి నిర్ధారణ చికిత్స విషయంలో నిర్లక్ష్యం నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. చలి జ్వరమా- ,లేరియా కావచ్చు అంటూ నినాదాలు చేస్తూ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి తొట్టెలతో తరచుగా శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎయిర్ కూలర్లు, టెంకాయ చిప్పలు దోమలకు ఆవాసాలుగా మారుతాయని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఇఒ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డప్ప, ఎఎన్ఎం ప్రమీల, భార్గవి, చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నవధాన్యాల సాగు లాభదాయకం

ప్రజాశక్తి - వల్లూరు

వరి పంట సాగు చేసే ముందు నవధాన్యాలు సాగు చేసుకోవడం వల్ల ఎరువుల వాడకం తగ్గించవచ్చని, దీని ద్వారా లాభదాయకం ఎక్కువగా ఉంటుందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పెద్దపుత్త గ్రామంలో గ్రామ మాజీ సర్పంచ్ తాడిగొట్ల రాఘవరెడ్డి పొలంలో పిఎండిఎస్ నవధాన్య సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రధానంగా ప్రధాన పంట వేసే ముందుగా నవధాన్యాలు సాగు చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని రైతులకు వివరించారు. ప్రధానంగా భూమిలో సారవంతమైన పంట వచ్చే విధంగా అధిక తెగుళ్లను అరికట్టవచ్చని చెప్పారు. భూమిలో ఉన్న సూక్ష్మజీవులకు ఆహారంగా పెంపొందించొచ్చు వీటివల్ల అధిక దిగుబడి తీసుకోవచ్చని తెలిపారు. నవధాన్యాలు సాగు చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. పెద్దపుత గ్రామంలో మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి రైతును ఆదర్శంగా తీసుకొని చుట్టుపక్కల రైతులు పిఎండిఎస్ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాఘవరెడ్డి, గ్రామ రైతులు బాలిరెడ్డి, ఎన్ ప్రొఫెసర్ భరత్ కుమార్ రెడ్డి, ఎన్ఎఫ్ఎ నరసింహారెడ్డి, ఎన్‌టి వెంకటరామిరెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి ఓబులయ్య, చంద్రశేఖర్, ఇంటర్నల్ కమిటీ రీసెర్చ్ పర్సన్స్ విజయలక్ష్మి, ఓబులమ్మ పాల్గొన్నారు.

నవదాన్యాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కలకడ : విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను అందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

విద్యార్థులకు పాఠశాల పునః ప్రారంభం సందర్భంగా సకాలంలో శ్రీరాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు భారతి తెలిపారు. మండల పరిధిలోని కొత్త బోయినపల్లి ఎస్‌జెఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి రోజే విద్యార్థులకు శ్రీ రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశామని అన్నారు. కార్పొరేట్ పాఠశాల కంటే దీటుగా వసతులు, విద్యా బోధన ఉన్న తమ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని సమీప నివాస ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.జనార్దన్, బి.శేష్ గిరి, ఎస్.వి. రామరాజు, ఏ.శివ ప్రసాద్ గౌడ్, యస్.ప్రభాకర్ రావు, యం.చెన్న కేశవులు, పి.విజయ బాస్కర్, ఓబు లేసు, శ్రీరాములు, అనిల్, రాజయ్య,ఈశ్వర్ నాయక్, ప్రసాద్, అమరావతి, దార్ల శ్రీనివాసులు ఆచారి ఃపాల్గొన్నారు. **కలకడ:** మండల కేంద్రమైన కలకడ ఉర్దూ హైస్కూలు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ సయ్యద్ భాష, కలకడ ఇంచార్జ్ జిలా నిబాషా, కలికిరి మార్కెట్ యాడ్ కమిటీ డైరెక్టర్ ముబారక్ అలీ, కలకడ టిడిపి మైనార్టీ నాయకులు జాఫర్ హుస్సేన్, ఇర్ఫాన్, ఖాజా హుస్సేన్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపిటిసి పురుషోత్తంరెడ్డి

విద్యార్థులకు నోటు పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-వీరబల్లి

రాజ్యసభ సభ్యులు, తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంపిటిసి ఎర్రపురెడ్డి పురుషోత్తంరెడ్డి విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో ఆయన కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యులు ఇలాంటి పుట్టిన రోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్న త శిఖరాలకు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రాజు, ఉపాధ్యాయుడు వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తహశీల్దార్

'చమర్తి'ని కలిసిన వీరబల్లి తహశీల్దార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం వీరబల్లి తహశీల్దార్ ఖాజాబీ రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. అనంతరం వీరబల్లి మండల సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ వీరబల్లి మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ, రైతు సమస్యలను, ప్రజల సమస్యలను పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు.

డ్వాక్రా మహిళలకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - వేముల : డ్వాక్రా మహిళలకు రుణాలు వెంటనే మంజూరు చేసి వారి జీవనోపాదులను పెంపొందించాలని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తిభవన్‌లో యూనియన్, ఎపిజిబి బ్యాంకు మేనేజర్లతో డ్వాక్రా రుణ వార్షిక ప్రణాళిక అమలు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 -26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళిక ప్రకారం అర్హత ఉన్న డ్వాక్రా సంఘాలకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని కోరారు. డ్వాక్రా సంఘాల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహించాలన్నారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే మహిళలకు రుణ సౌకర్యం కల్పించాలన్నారు. వేముల మండలం వ్యాప్తంగా ఆసక్తి ఉన్న రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ జయచంద్ర, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు జ్యోతి, జైపాల్, నాగేశ్వరి, గంగరాజు, మండల సమాఖ్య అకౌంటెంట్ చిన్న రెడ్డి పాల్గొన్నారు.

రైతన్నలకు ప్రభుత్వం అండ

ప్రజాశక్తి- లింగాల : నూతన విధానంలో భాగంగా వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇప్పట్ల గ్రామంలో లక్ష్మి వెంకటేశ్వర రైతు మిత్ర బృందం సభ్యులకు 80 శాతం రాయితీతో వ్యవసాయ డ్రోన్ పరికరాలను శుక్రవారం వేంపల్లె మండల పరిశీలకుడు రఘునాథరెడ్డితో కలిసి కార్యాలయంలో పంపిణీ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ సాయంతో వ్యవసాయాన్ని సులువుగా, లాభదాయకంగా మార్చేందుకు దోహదపడుతుందని తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తరణలో మందులు పిచికారీ చేసుకోవచ్చన్నారు. యువ రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాయితీ పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఒ రమేష్, రైతు సేవా సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని అన్నవరంపాడు దిగవపల్లి గ్రామానికి చెందిన పిడికిటి సుబ్రహ్మణ్యంనాయుడు(65) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు సుబ్రహ్మణ్యం నాయుడు శుక్రవారం ఉదయం తమ పొలానికి నీరు పట్టేందుకు ద్విచక్ర వాహనంలో వెళ్లాడని తెలిపారు. పొలం వద్ద మోటార్ వేసి తిరిగి వస్తుండగా రాజంపేట నుంచి తిరుపతి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడక్కడ మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రైల్వేకోడూరుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు.